తెలంగాణ
# జీవగడ్డ
ఎడిటర్:
మోటపలుకుల వెంకట్
డిజిటల్ పత్రిక


తీన్మార్ మల్లన్న-ఎమ్మెల్సీ, తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధ్యక్షులు




ఎడిటర్ : మోటపలుకుల వెంకట్ , మంగళవారం 24-02-2026 సంపుటి :02 సంచిక : 137 పేజీలు :04 వెల : 3.00





హైదరాబాద్, ఫిబ్రవరి 23 :
తెలంగాణలోని జయశంకర్ భూపాలపల్లి, సిద్దిపేట, నిర్మల్ జిల్లాల్లో ఈదురుగాలులు, వడగళ్లతో కూడిన భారీ వర్షం కురిసింది. మిర్చితో సహా పలు పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. అలాగే పలుచోట్ల విద్యుత్ సరఫరాకి అంతరాయం కలిగింది.తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో (సోమవారం) అకస్మాత్తుగా భారీ వర్షాలు కురిశాయి. వాతావరణం ఒక్కసారిగా మారిపోయి.. వడగళ్లు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ముఖ్యంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా, సిద్దిపేట జిల్లా, నిర్మల్ జిల్లాల్లో వడగళ్ల వర్షం బీభత్సం సృష్టించింది. ఈ వర్షాలతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లగా, విద్యుత్ సరఫరాకి కూడా అంతరాయం కలిగింది. 2

## నా పేరుతో ఎలాంటి సంస్థల
# నిర్వహణకూ అనుమతి లేదు



హైదరాబాద్, ఫిబ్రవరి 23: తన పేరుతో ఎలాంటి సంస్థల నిర్వహణకూ అనుమతి లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు స్పష్టం చేశారు. తన పేరుతో కొంతమంది సంస్థలు ఏర్పాటు చేసిన విషయంపై ఆయన స్పందించారు. ఎవరైనా పనిచేయాలనుకుంటే బీఆర్ఎస్‌తో కలిసి పనిచేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కేటీఆర్ ఓ ప్రకటన విడుదల చేశారు. 'కేటీఆర్ సేవా సమితి', 'కేటీఆర్ సేన'.. పేరుతో కార్యకలాపాలు చేపట్టవద్దని చెప్పారు.తన పేరుతో ఎలాంటి సంస్థలకూ అనుమతి లేదని.. అలాంటి ప్రయత్నాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రోత్సహించబోమని కేటీఆర్ స్పష్టం చేశారు. ఇలాంటి సంస్థలకు ఎటువంటి గుర్తింపు, అనుమతి లేదనే విషయాన్ని అందరూ గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. ఎవరైనా పనిచేయాలనుకుంటే ఖచ్చితంగా భారత రాష్ట్ర సమితి పరిధిలోనే పనిచేయాల్సి ఉంటుందని కేటీఆర్ స్పష్టం చేశారు. తన పేరుతో పలు సంస్థల ద్వారా చేస్తున్న కార్యక్రమాలను ఆపేయాలని.. తనపై అభిమానం ఉన్నవాళ్లు భారత రాష్ట్ర సమితితో కలిసి పని చేయొచ్చని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు.




# తెలంగాణ క్యాబినెట్ భేటీ-జనగణనపై కీలక చర్చ

హైదరాబాద్, ఫిబ్రవరి 23 :
తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన ఇవాళ(సోమవారం) క్యాబినెట్ సమావేశం అయింది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై మంత్రులతో సీఎం రేవంత్‌రెడ్డి చర్చిస్తున్నారు. అయితే, స్వల్ప అనారోగ్యం కారణంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమావేశానికి హాజరు కాలేదు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన జనగణనపై మంత్రిమండలి భేటీలో కీలక చర్చ జరిగింది. ఈ చర్చలో జనగణన వివరాలను తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు వెల్లడించారు. రెండు దశల్లో జనగణన ప్రక్రియ 2027 ఫిబ్రవరిలో రెండో దశ ప్రారంభం కానుంది. జనగణన కోసం రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ఏర్పాట్లపై మంత్రివర్గంలో చర్చించారు.10వ తరగతి విద్యార్థిపై దాడి! 30 సెకన్లలో 27 కత్తిపోట్లుజనగణన-2027 కోసం రాష్ట్ర ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేసింది. మే 11వ తేదీ నుంచి హౌస్ లిస్టింగ్ ప్రారంభం కానుంది. రాష్ట్రంలో జనగణన ప్రక్రియకు 89 వేల మంది సిబ్బందిని నియమించింది. మే 11వ తేదీ నుంచి జూన్ 9వ తేదీ వరకు హౌస్ లిస్టింగ్ ఆపరేషన్ చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు పూర్తి చేసింది. జనగణన 2027పై కేబినెట్ నిర్ణయాలని సీఎస్ రామకృష్ణారావు వెల్లడించారు. కేంద్రం నిర్దేశించిన 34 ప్రశ్నలతో జనగణన హౌస్ లిస్టింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది. హౌస్ లిస్టింగ్‌కు కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన 34 ప్రశ్నల నమూనాను సీఎస్ వివరించారు. రాష్ట్రంలో ఎన్యుమరేటర్లతో పాటు నోడల్ ఆఫీసర్లు మొత్తం 89 వేల మంది ఉద్యోగులు జనగణన ప్రక్రియలో పాలుపంచుకుంటారని తెలిపారు.



తెలంగాణ జీవగడ్డ
ఎడిటర్: మోటపలుకుల వెంకట్
డిజిటల్ పత్రిక



# హైదరాబాద్ మెట్రోపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం




హైదరాబాద్, ఫిబ్రవరి 23: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన ఇవాళ(సోమవారం) క్యాబినెట్ సమావేశం జరుగుతోంది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై మంత్రులతో సీఎం చర్చిస్తున్నారు. హైదరాబాద్ మెట్రోపై తెలంగాణ క్యాబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం హైదరాబాద్ మెట్రోని నిర్వహిస్తున్న ఎల్‌అండ్‌టీ నుంచి పూర్తిగా ప్రభుత్వాధీనంలోకి తీసుకునేందుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయం ప్రకారం మార్చి 31వ తేదీలోపు మెట్రోను పూర్తిగా స్వాధీనం చేసుకునేలా ప్రభుత్వం చర్యలు చేపట్టనుంది. ఈ టేకోవర్ మొత్తం విలువ సుమారు రూ.15,000 కోట్లుగా అంచనా వేసింది. ఇందులో మెట్రోపై ఉన్న అప్పులు రూ.13,000 కోట్లు కాగా, ఎల్ అండ్‌టీ సంస్థ ఈక్విటీ వాటా రూ.2,000 కోట్లుగా ఉంది.కేంద్ర అనుమతుల కోసం కీలక అడుగు..
మెట్రో రెండో దశ విస్తరణకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వాలంటే మొదటి దశ పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలో ఉండాలని కేంద్ర ప్రభుత్వం షరతు విధించింది. ఈ నేపథ్యంలోనే మెట్రోను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకునే నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ నిర్ణయంతో హైదరాబాద్ మెట్రో విస్తరణకు మార్గం సుగమం కానుంది. నగరంలో రవాణా సౌకర్యాలు మరింత మెరుగుపడే అవకాశం ఉంది.మెట్రో టేకోవర్ వల్ల ప్రయోజనాలు..ప్రభుత్వ ఆధీనంలోకి మెట్రో వచ్చిన తర్వాత.. మెట్రో విస్తరణ వేగవంతం అవుతుంది. ప్రయాణికులకు మరిన్ని సౌకర్యాలు కల్పించే అవకాశం ఉంటుంది. రవాణా వ్యవస్థపై ప్రభుత్వానికి పూర్తి నియంత్రణ ఉంటుంది. భవిష్యత్ ప్రాజెక్టులకు కేంద్ర సహాయం పొందడం సులభం అవుతుంది. ఇది నగర అభివృద్ధికి కీలక నిర్ణయంగా భావిస్తోంది.

# కర్ణాటకలో కుమ్ములాట



కేబినెట్ విస్తరణ కోసం 31 మంది ఎమ్మెల్యేలు రాహుల్‌కు లేఖ
బెంగళూరు: కర్ణాటకలో నాయకత్వ మార్పు కోసం జరుగుతున్న పోరు మరో మలుపు తిరిగింది. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణలో తమకు చోటు కల్పించాలని కోరుతూ తొలిసారి గెలిచిన 31 మందికి పైగా ఎమ్మెల్యేలు పార్టీ అధిష్టానానికి సోమవారంనాడు లేఖ రాశారు. లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేను అడ్రెస్ చేస్తూ ఎమ్మెల్యేలు ఈ లేఖ రాశారు.'కర్ణాటక ప్రజలు కాంగ్రెస్ పార్టీ నుంచి 38 మంది కొత్త వారిని ఎమ్మెల్యేలుగా అసెంబ్లీకి పంపిన విషయం మీకు తెలుసు. తద్వారా అసెంబ్లీలో కొత్త వారిని చూడాలని అనుకుంటున్నట్టు ప్రజలు స్పష్టమైన సందేశాన్నిచ్చారు' అని అధిష్టానానికి రాసిన లేఖలో ఎమ్మెల్యేలు పేర్కొన్నారు. అయితే మంత్రివర్గంలో 34 మందికి చోటు కల్పించినప్పటికీ కొత్తగా ఎన్నికైన ఒక్క ఎమ్మెల్యేకు కూడా అవకాశం కల్పించలేదని అన్నారు. ఆ దృష్ట్యా తొలిసారి ఎన్నికైన సమర్ధత కలిగిన యువ ఎమ్మెల్యేలకు మంత్రులుగా సేవ చేసే అవకాశం కల్పించాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు.పార్టీ అధిష్ఠానానికి రాసిన లేఖపై సంతకాలు చేసిన ఎమ్మెల్యేలలో ఏఎస్ పొన్నన్న, అశోక్ రాయ్, శ్రీనివాస్ ఎన్‌టీ, పి.రవికుమార్, ఏసీ శ్రీనివాస్, హెచ్‌వి ఇక్బాల్ హుస్సేన్, బి.దేవేంద్ర, నారా భరత్ రెడ్డి, విశ్వాస్ వి వైద్య, బసవరాజ్ వి శివగంగ తదితరులు ఉన్నారు.

# తెలంగాణలో వడగళ్ల వాన బీభత్సం

**హైదరాబాద్, ఫిబ్రవరి 23 :**
తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఈ రోజు(సోమవారం) అకస్మాత్తుగా భారీ వర్షాలు కురిశాయి. వాతావరణం ఒక్కసారిగా మారిపోయి.. వడగళ్లు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ముఖ్యంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా, సిద్దిపేట జిల్లా, నిర్మల్ జిల్లాల్లో వడగళ్ల వర్షం బీభత్సం సృష్టించింది. ఈ వర్షాలతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లగా, విద్యుత్ సరఫరాకి కూడా అంతరాయం కలిగింది.
కాళేశ్వరంలో వడగళ్ల వాన బీభత్సం.
జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలోని కాళేశ్వరం ప్రాంతంలో వడగళ్ల వాన తీవ్రంగా కురిసింది. భారీ గాలులు, వడగళ్ల కారణంగా పలుచోట్ల విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. విద్యుత్ వైర్లు తెగిపడటంతో స్థానికంగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఈ వడగళ్ల వాన కారణంగా ముఖ్యంగా మిర్చి, పత్తి, ఇతర వాణిజ్య పంటలకు భారీ నష్టం వాటిల్లింది. ఇప్పటికే పెట్టుబడులు పెట్టిన రైతులు ఒక్కసారిగా నష్టపోవడంతో ఆందోళన చెందుతున్నారు.
సిద్దిపేట జిల్లాలో..
సిద్దిపేట జిల్లాలోని చేర్యాల, కొమురవెల్లి, మద్దూర్, దూల్మిట్ట మండలాల్లో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. గాలుల తీవ్రతకు చెట్లు విరిగిపడిన ఘటనలు చోటుచేసుకున్నాయి. అలాగే సిద్దిపేట, దుబ్బాక పట్టణాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. వర్షపు నీటితో పలు రహదారులు జలమయమయ్యాయి. రోడ్లపై నీరు నిల్వ ఉండటంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.
నిర్మల్ జిల్లాలో..
నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలో కూడా ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. వర్షంతో కొన్ని ప్రాంతాల్లో చెట్లు విరిగిపడటం, విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగడం వంటి సమస్యలు తలెత్తాయి.




ఒక్కసారిగా మారిన వాతావరణం..
ఈ వర్షాలతో తెలంగాణలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఇప్పుడిప్పుడే ఎండ తీవ్రత పెరుగుతండగా.. ఒక్కసారిగా వడగళ్ల వాన, ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో ప్రజలకు ఉపశమనం లభించింది. అయితే రైతులకు మాత్రం తీవ్ర నష్టం కలిగింది.
రైతులకు భారీ నష్టం..
వడగళ్ల వాన కారణంగా ముఖ్యంగా మిర్చి, పత్తి, కూరగాయల పంటలు, ఇతర వాణిజ్య పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. వడగళ్ల వర్షంతో పంటలు నేలకూలిపోయాయి. అలాగే మరోవైపు ఈదురుగాలుల కారణంగా పలుచోట్ల విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. విద్యుత్ వైర్లు తెగిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అధికారులు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు చర్యలు చేపడుతున్నారు.
అధికారుల అప్రమత్తత..
వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అధికారులు అప్రమత్తమయ్యారు. నష్టాలను అంచనా వేయడానికి సంబంధిత శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలనలు చేపడుతున్నారు. రైతులకు నష్టం జరిగిన ప్రాంతాల్లో నివేదికలు సేకరిస్తున్నారు.

# సుప్రీంకోర్టులో గౌరవెల్లి ప్రాజెక్ట్ కేసు గెలుస్తాం

హైదరాబాద్, ఫిబ్రవరి 23
గౌరవెల్లి ప్రాజెక్టు.. అనేక కారణాలు, లీగల్ సమస్యల వల్ల ఆలస్యం అవుతుందని తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ ప్రాజెక్టుపై మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్.. సచివాలయంలో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఈ ప్రాజెక్టు కాలువల భూసేకరణ పూర్తి చేసి పనులు వేగవంతం చేసేలా సమీక్షా సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడారు. పొన్నం ప్రభాకర్ గౌరవెల్లి ప్రాజెక్టు కోసం తమ మీద ఒత్తిడి తీసుకొస్తున్నారని తెలిపారు. సిద్దిపేట, కరీంనగర్, హనుమకొండ మూడు జిల్లాల కలెక్టర్లు, రాష్ట్ర అడ్వకేట్ జనరల్, ఇరిగేషన్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించామని అన్నారు.గౌరవెల్లి ప్రాజెక్టులో లీగల్ ఇబ్బందులు ఎలా క్లియర్ చేయాలో చర్చించామని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ప్రాజెక్టు భూసేకరణ, పనుల వేగవంతంపై ఎలా ముందుకు వెళ్లాలో చర్చించామన్నారు. భూసేకరణ విషయంలో హామీ ఇచ్చామని తెలిపారు. సంబంధిత నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చామని అన్నారు. ఈ



మేరకు బుధవారం నాడు సుప్రీంకోర్టులో ఈ ప్రాజెక్టు కేసు విచారణ ఉందని ప్రస్తావించారు. సర్వోన్నత న్యాయస్థానంలో ఎన్విరాన్‌మెంట్ కేసు గెలుస్తామనే విశ్వాసం తమకుందన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టును అన్ని విధాలుగా పూర్తి చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. దేవాదుల ప్రాజెక్టు నీళ్లు హుస్నాబాద్ నియోజకవర్గానికి రావడానికి కావల్సిన పెండింగ్ పనులు పూర్తి చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ స్పెషల్ సెక్రటరీ ప్రశాంత్ జీవన్ పాటిల్, కరీంనగర్, సిద్దిపేట, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు, ఇరిగేషన్ అధికారులు, ప్రాజెక్టు ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.







# అతడి ఆలోచన మారాలి

## అభిషేక్ శర్మపై గావస్కర్ కీలక వ్యాఖ్యలు

భారత్ జట్టు విధ్వంసకర ఓపెనర్‌గా పేరొందిన అభిషేక్ శర్మపై టీమిండియా దిగ్గజం సునీల్ గావస్కర్ కీలక వ్యాఖ్యలు చేశాడు. అతడి ఆలోచన విధానం మారి.. సింగిల్స్ తీయడానికి ప్రయత్నం చేయాలని సూచించాడు.అతడి ఆలోచన మారాలి.. అభిషేక్ శర్మపై గావస్కర్ కీలక వ్యాఖ్యలుటీమిండియా విధ్వంసకర ఓపెనర్‌గా పేరొందిన అభిషేక్ శర్మవైఫల్యాలు కొనసాగుతున్నాయి. టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీలో ఆడిన మూడు మ్యాచ్‌లలోనూ డకౌట్ అయి.. లీగ్ దశను అవమానకర రీతిలో ముగించాడు. గ్రూప్-ఎలో భాగంగా యూఎస్ఏ మ్యాచ్‌లో గోల్డెన్ డక్‌గా వెనుదిరిగిన అభిషేక్ శర్మ . పాకిస్థాన్‌తో మ్యాచ్‌లోనూ డకౌట్ అయ్యాడు. తాజాగా నిన్న(బుధవారం) నెదర్లాండ్స్‌తో మ్యాచ్‌లోనూ ఖాతా తెరవకుండానే పెవిలియన్ చేరాడు. ఈ నేపథ్యంలో అభిషేక్ శర్మపై టీమిండియా దిగ్గజం సునీల్ గావస్కర్ కీలక వ్యాఖ్యలు చేశాడు.ఓ స్పోర్ట్స్ ఛానల్ కు సంబంధించిన షోలో గావస్కర్‌మాట్లాడుతూ.. 'అభిషేక్ శర్మ ముందుగా ఒత్తిడి నుంచి బయటపడాలి. విధ్వంసకర ప్లేయర్‌ను అనే తనకున్న ట్యాగ్‌ను మరచిపోయి స్వేచ్ఛగా ఆడినప్పుడే అనుకున్న ఫలితం రాబట్టగలడు. తొందరపడకుండా తెలివిగా షాట్లు ఆడాలి. అయితే అంచనాల భారం అతడిపై ఒత్తిడిని పెంచుతోంది అనుకుంటున్నాను. సిక్స్ హిట్టర్ అని పేరున్న అభిషేక్ ఆ ఒత్తిడిని తట్టుకోలేకపోతున్నాడు. ప్రపంచంలోనే నంబర్ వన్ టీ20 బ్యాటర్ అతడు. ఆ ట్యాగ్ అతడిని ఒత్తిడిలోకి నెట్టేస్తుందేమో!. కారణం ఏదైనప్పటికీ అభిషేక్ కాస్త ఓపికగా ఉండాలి' అని తెలిపాడు.'మొదటి బంతి నుంచే బౌండరీ, సిక్సర్ బాదాలని అనుకోవడం సరికాదు. ముందు సింగిల్స్ తీస్తూ తెలివిగా ఆడాలి. ముఖ్యంగా తన కాళ్లను సరిగ్గా ఉపయోగించుకోవాలి. లేదంటే అతడి షాట్ సెలక్షన్‌ను ఎవరైనా ముందే పసిగట్టగలరు. 200కు పైగా స్ట్రైక్ రేటుతో బ్యాటింగ్ చేసే ప్లేయర్‌గానే తనను చూస్తారన్న ఆలోచన నుంచి అభిషేక్ బయటకు రావాలి. నీ సహజశైలిలో ఆడు.. అప్పుడు తప్పక భారీ స్కోరు సాధించగలవు" అని సునీల్ గావస్కర్ అభిషేక్ శర్మకు కీలక సూచనలు చేశాడు.








# ఎక్స్ బాయ్ ఫ్రెండ్ సీక్రెట్స్ చెప్పిన మృణాల్

హిందీతో పాటు తెలుగువారికీ సుపరిచితమైన మృణాల్ ఠాకూర్  నటించిన తాజా చిత్రం 'దో దీవానే షహర్ మే' శుక్రవారం జనం ముందుకు వచ్చింది. సినిమా విడుదలకు ముందు హీరో సిద్ధాంత్ చతుర్వేది  తో కలిసి ఆమె విశేషంగా ప్రమోషన్స్‌లో పాల్గొంది. ఆ సమయంలో మృణాల్ ఠాకూర్ చెప్పిన మాజీ బాయ్ ఫ్రెండ్ ముచ్చట్లు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. సహజంగా బాలీవుడ్ అందాల ముద్దుగుమ్మలు తాము రిలేషన్‌లో ఉన్నప్పుడు ఆ విషయాన్ని చెప్పరు కానీ బ్రేకప్ అయిన తర్వాత మాత్రం గత కాలపు ప్రేమ ముచ్చట్లను కథలు కథలుగా చెబుతుంటారు. మృణాల్ ఠాకూర్ సైతం అందుకు మినహాయింపు కాదు.తన కెరీర్ ప్రారంభంలో స్కాండినేవియన్‌కు చెందిన ఓ బాయ్ ఫ్రెండ్ ఉండేవాడని, అయితే అతనికి చాలా ఇన్ సెక్యూర్డ్ ఫీలింగ్ ఉండేదని మృణాల్ ఠాకూర్ తెలిపింది. మృణాల్ ఠాకూర్ అప్పట్లో హృతిక్ రోషన్  మూవీ 'సూపర్ 30'లో నటించింది. అలానే ఆ తర్వాత షహీద్ కపూర్ తో 'జెర్సీ'లో యాక్ట్ చేసింది. వీరిద్దరినీ చూసి తన బాయ్ ఫ్రెండ్ చాలా జెలసీ ఫీలయ్యే వాడని, వాళ్ళులాగా హ్యాండ్సమ్‌గా కనిపించడానికి బాగా వర్కౌట్స్ చేసేవాడని మృణాల్ తెలిపింది. అందులో భాగంగా ఆ బాయ్ ఫ్రెండ్ ఏకంగా పదిహేను నుండి పదిహేడు కేజీల బరువు కూడా తగ్గిపోయాడని చెప్పింది. తాను లాంగ్ డిస్టెన్స్ రిలేషన్‌లో ఉండటం వల్ల వర్క్‌పై ఫోకస్ పెట్టగలిగే దాన్నని, అది ఒక రకంగా మంచిదే అయ్యిందని ఆమె తెలిపింది. ఇన్ సెక్యూరిటీతో వర్కౌట్స్ చేసి బాగా బరువు తగ్గిన ఆ స్నేహితుడు ఆ తర్వాత వాటిని ఆపేయడంతో ఏకంగా ఇరవై కేజీల బరువు పెరిగాడని చెప్పింది. తానెప్పుడూ అతన్ని బరువు తగ్గమని చెప్పలేదని, అలానే కండలు ఉంటేనే తాను స్నేహం చేస్తానని కూడా అనలేదని మృణాల్ స్పష్టం చేసింది. ఏదేమైనా... ఇప్పుడు ఆమె జీవితం నుండి తప్పుకున్న ఆ బాయ్ ఫ్రెండ్ కారణంగా మీడియాకు మృణాల్ ఆసక్తికరమైన ముచ్చట్లు తెలిపింది.

